

పుస్తక జ్ఞానానికి ప్రాక్టికల్ అనుభవం..

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

దేవరకొండ, నవంబర్ 07, (ప్రజా జ్యోతి) :

విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో నేరడుగొమ్ము మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శనివారం ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు.ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం రిటైల్ విద్యార్థులు విటీపీ ఇండస్ ఎడుట్రైన్ లిమిటెడ్ సంస్థ సహకారంతో దేవరకొండలోని అంజలి సూపర్ మార్కెట్‌ను సందర్శించారు.

వివరాలు 2లో



ఆదివారం 08 నవంబర్ 2026 పేజీలు:16

ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలు తెలుసుకున్న - ఎమ్మెల్యే బాలు నాయక్



- పీఏ పల్లి మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం.. మహిళా సమాఖ్య భవనాల ప్రారంభం, గ్రామపంచాయతీ భవనాలకు భూమిపూజ

దేవరకొండ, నవంబర్ 07, (ప్రజా జ్యోతి) :

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శనివారం పీఏ పల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాలను ప్రారంభించడంతో పాటు నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు భూమిపూజ చేసి శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడారు.

- మిగతా 2 లో

65 లక్షల అప్పుకు 2.35 కోట్లు గుంజినా ఆగని బెదిరింపులు

- పాల్వాయి శ్రావణ్ రెడ్డి పై పాల్వాయి స్రవంతి రాజకీయ కక్ష ఆరోపణలు



చండూరు నవంబర్ 7 ప్రజా జ్యోతి):-

ఇడికుడ గ్రామంలో శనివారం సాయంత్రం డబ్బుల వ్యవహారం కలకలం రేపింది. బంగారిగడ్డ గ్రామానికి చెందిన బోయపల్లి స్వామి అనే వ్యక్తి, తనకు డబ్బులు ఇవ్వాలంటూ ఇడికుడ గ్రామానికి చెందిన పాల్వాయి శ్రవణ్ కుమార్ రెడ్డి ఇంటి వద్దకు పురుగుల మందు డబ్బాతో వచ్చి ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేసినట్లు తెలిసింది. శనివారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది.

- మిగతా 2 లో

గ్రామాల అభివృద్ధికే మండల సమీక్ష సమావేశాలు



- ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట నవంబర్ 7 (ప్రజా జ్యోతి) :

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి సమస్యలు పరిష్కరించేందుకే మండల సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆవుల రాములు అధ్యక్షతన మండల సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

- మిగతా 2 లో

పోచంపల్లి కాంగ్రెస్‌కు కొత్త కార్యవర్గం.. పలువురికి బాధ్యతలు



భూదాన్ పోచంపల్లి, నవంబర్ 7 (ప్రజాజ్యోతి):

కాంగ్రెస్ పార్టీని మండలంలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా భూదాన్ పోచంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ నూతన కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో ఉపాధ్యక్షులుగా గట్టు రామ్ రెడ్డి, కాసుల బాలకృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా పడాల సతీష్ చారి, బోదాసు ఈదయ్య, బద్దం రాజేశ్వర్ గౌడ్, కంటే లింగస్వామి యాదవ్‌లను నియమించారు. కార్యదర్శులుగా రేవల్లి యాదగిరి, బంటు గణేష్, గుర్రం సత్యపాల్ రెడ్డి, కందాళ గణేష్, పగుడాల అంజయ్య, కొత్తపల్లి శ్రీశైలంలను ఎంపిక చేశారు.

- మిగతా 2 లో

ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే బాలు నాయక్



మొదటిపేజీ తరువాయి

మండలంలోని అంగడిపేట గ్రామంలో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, అనంతరం రాంపురం గ్రామంలోని నేనావత్ తండాలో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి భూ సమస్యలను తెలుసుకొని, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.పిల్లిగుండ్ల తండాలో డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.13 లక్షల నిధుల మంజూరు విషయమై జిల్లా కలెక్టర్‌తో ప్రజల సమక్షంలోనే ఫోన్‌లో మాట్లాడారు. పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా గ్రామంలోని ఇతర సమస్యలను తెలుసుకొని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులతో మాట్లాడారు.మాదారిగూడెం గ్రామంలో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించి, నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. రంగారెడ్డి గూడెం గేటు వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం హామీ ఇచ్చారు.అనంతరం పిల్లిగుండ్ల తండాలో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించి, నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారత, రైతుల సమస్యల పరిష్కారం, పేదలకు సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చే సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నేర్మటి సతీష్ రెడ్డి, ఏవీ రెడ్డి, కుక్కల గోవర్ధన్ రెడ్డి, వీరబోయిన ఎల్లయ్య యాదవ్, మద్దిమడుగు రామస్వామి, తేరా సత్యం రెడ్డి, వంగాల ప్రతాపరెడ్డి, పాల్వాయి వెంకట్ రెడ్డి, బోడ్య నాయక్, తూటిపల్లి నగేష్, మావిల్ల లక్ష్మీనారాయణ, రామావత్ చిరంజీవి, నేనావత్ అనిత లక్ష్మణ్, ఇస్లావత్ బుజ్జి నాగు నాయక్, రాగం అంజయ్య, రామావత్ నారాయణ, మండల సర్పంచులు, ఉపసర్పంచులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధికే మండల సమీక్ష సమావేశాలు

మొదటిపేజీ తరువాయి

మండల సమీక్ష సమావేశానికి మండల శాఖ అధికారులు కచ్చితంగా పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీ సులు అందజేయాలని ఆదేశించారు. ఎల్ ని నో తో రాజకీయం చేయ వద్దని రాజకీయాలకు అతీతంగా ఎల్ నీ నో ను ఎదుర్కోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి ఇతర సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎల్ నీనోతో రాష్ట్రంలోకరువు పరిస్థితులు ఏర్పడితే ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అని విపక్షాలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని అది వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా మండల శాఖ అధికారులు హాజరై తమ నివేదికలను చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాఘవరెడ్డి, తాసిల్దార్ లాల్ బహుదూర్,పి ఏ సి ఎస్‌చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



65 లక్షల అప్పుకు 2.35 కోట్లు గుంజినా ఆగని బెదిరింపులు

మొదటిపేజీ తరువాయి

ఈ ఘటనపై శ్రవణ్ కుమార్ రెడ్డి వద్ద పనిచేస్తున్న శ్రీనివాసులు స్పందిస్తూ.. డబ్బుల వ్యవహారంపై సుమారు 15 రోజుల క్రితమే చందూరు మాజీ సర్పంచ్ , పెద్దమనుషుల సమక్షంలో సెటిల్మెంట్ జరిగిందని తెలిపారు. స్వామికి అసలు రూ.65 లక్షలు ఇవ్వాల్సి ఉండగా, ఐదు రూపాయల వడ్డీతో కలిపి ఇప్పటికే విడతలవారీగా సుమారు రూ.85 లక్షలు నగదు రూపంలో చెల్లించామని పేర్కొన్నారు. ఇందులో ఒక విడతలో రూ.45 లక్షలు, మరో విడతలో రూ.23 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. అదేవిధంగా నాలుగు ఎకరాల భూమిని కూడా స్వామి పేరుపై రిజిస్ట్రేషన్ చేసినట్లు వెల్లడించారు.అన్ని లెక్కలు కలిపి ఇప్పటివరకు స్వామికి సుమారు రూ.2 కోట్ల 35 లక్షల విలువైన నగదు, భూమి రూపంలో చెల్లింపులు జరిగాయని శ్రీనివాసులు ఆరోపించారు. అయినప్పటికీ ఇంకా డబ్బులు ఇవ్వాలని వేధింపులకు గురిచేస్తున్నారని, తాము చేసిన ప్రతి చెల్లింపునకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. సర్పంచి ఎన్నికల సమయం నుండి పాల్వాయి శ్రావణ్ కుమార్ రెడ్డి పై రాజకీయ కక్ష పూరితంతో పాల్వాయి స్రవంతి ఉద్దేశపూర్వకముతో కుటుంబంలో కలహాలు సృష్టిస్తున్నట్టుగా తెలిపారు...



పుస్తక జ్ఞానానికి ప్రాక్టికల్ అనుభవం.. విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా సూపర్ మార్కెట్ నిర్వహణ, వస్తువుల కొనుగోలు, విక్రయాలు, ధరల నిర్ణయం, నిల్వ, కస్టమర్ సేవలు వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి అవగాహన పొందారు.అదేవిధంగా తొమ్మిదో తరగతి ఐటీ అండ్ ఐటీఈఎస్ బ్రేడ్ విద్యార్థులు విటీపీ స్కిల్ ట్రీ కన్సల్టింగ్ లిమిటెడ్ సంస్థ సహకారంతో దేవరకొండలోని బైట్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ పరిజ్ఞానం, ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఐటీ సేవల నిర్వహణపై అవగాహన కల్పించారు..

పోచంపల్లి కాంగ్రెస్‌కు కొత్త కార్యవర్గం.. పలువురికి బాధ్యతలు

మొదటిపేజీ తరువాయి

కార్యనిర్వాహక సభ్యులుగా కె.గోవర్ధన్, గంగాదేవి నరసింహరాజు, దుర్గం పాపయ్య, కాసుల సత్తయ్య, శపక కిష్టమ్మ, శ్రీలత, రావుల సంధ్య, పగిళ్ల సాయిప్రియలకు అవకాశం కల్పించారు.నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతుల పేరిట యాదగిరిగుట్టలో ప్రత్యేక పూజలు

నల్లగొండ నవంబర్ 7(: ప్రజా జ్యోతి ప్రతినిధి)

నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం రెండు వేర్వేరు ప్రమాదాల నుంచి క్షేమంగా బయటపడిన నేపథ్యంలో ఆయన, ఆయన సతీమణి పుష్పల పేరిట యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నకిరేకల్ 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు పోరండ్ల శివ హర్షిత శనివారం స్వామివారికి పూజలు చేయించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.



జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం.. నలుగురికి తీవ్ర గాయాలు

నల్లగొండ నవంబర్: 7 (ప్రజా జ్యోతి ప్రతినిధి)

కట్టంగూరు మండలం పైటిపాముల గ్రామ శివారులో హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ వైపు వెళ్తున్న రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ముందు వెళ్తున్న కారు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసం కాగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

- తెలిపిన మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



దేవరకొండ, నవంబర్ 07, (ప్రజా జ్యోతి) :

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపావళి చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో దీపావళికి విశిష్టమైన స్థానం ఉందని, దీపాల వెలుగులు ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆశలు, ఆనందాలు నింపాలని అన్నారు. ప్రజలందరూ సత్ప్రవర్తన, మానవతా విలువలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ దీపావళి దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు.



దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన దైద రవీందర్

నల్లగొండ నవంబర్ 7 (ప్రజా జ్యోతి ప్రతినిధి)

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ రాష్ట్ర ప్రజలకు, నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఇంటా ఆనందాల దీపాలు వెలిగించాలని అన్నారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవాలని, సుఖశాంతులు, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ, నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు మరోసారి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

దీపావళి పూజలు ఎప్పుడు చేయాలి? బ్రాహ్మణ సంఘం కీలక ప్రకటన!

దీపావళి పర్వదిన పూజలపై బ్రాహ్మణ సంఘం నిర్ణయం

నల్లగొండ, నవంబర్ 7: (ప్రజా జ్యోతి ప్రతినిధి)

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పూజలు, వ్రతాలు నిర్వహించాల్సిన సమయాలను శాలిగౌరారం మండల కేంద్రంలోని బ్రాహ్మణ సంఘం సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు పండితులు, అర్చకులు, పురోహితులు వెల్లడించిన వివరాల ప్రకారం..ఈ నెల 8వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 6 గంటలలోపు మంగళహారతులు నిర్వహించడం శుభప్రదమని తెలిపారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు ధనలక్ష్మీ పూజలు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. నవంబర్ 9వ తేదీ సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కేదారేశ్వర గౌరీ వ్రతాలు, దీపావళి నోములు నిర్వహించుకోవచ్చని వెల్లడించారు. విశాఖ కార్తె ఉన్న కారణంగా నూతన వ్రతాలు, కొత్త నోములు ప్రారంభించడానికి అనుకూల సమయం కాదని, కొత్తల్లుడు కూడా ఇంటికి రావడానికి ఇది సరైన సమయం కాదని ముఖ్య గమనికగా సూచించారు. ఈ నిర్ణయంలో రామడుగు వెంకటరామ శర్మ (శాలిగౌరారం), వావిలాల రామలింగయ్య శర్మ (వల్లాల), మాదారం పులి రామకృష్ణ శర్మ, చిత్తలూరు కొండగడప వెంకటేశ్వర శర్మ, గురజాల కొడవగంటి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, కొత్తపల్లి లక్ష్మీనరసయ్య శర్మ, రామాంజపురం వెంకటేశ్వర శర్మ (అమ్మనబోలు), ఇటుకులపాడు వావిలాల లక్ష్మీప్రసాద్ శర్మ, వావిలాల వేణునాథ శర్మ తదితర అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, గౌరీశ్వరుల అనుగ్రహంతో సర్వేజనా సుఖినోభవంతు, సమస్త సన్మంగళాని భవంతు అని ఆకాంక్షించారు.



కె.ఆర్ ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో

ఎన్.సి.సి క్యాడెట్స్ ఎంపిక

కోదాడ టౌన్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):

కోదాడ పట్టణంలోని కె. ఆర్.ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలకు ఇటీవల 2026-27 విద్యా సంవత్సరంకు ఎన్. సి.సి యూనిట్ మంజూరైనది .ఈ క్రమంలో ఈ రోజు (7/11/2026) న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హదసారాణి ఆధ్వర్యంలో ఎన్.సి.సి విద్యార్థుల సెలక్షన్









జరిగింది ఈ కార్యక్రమానికి నల్గొండ నుండి సుబేదార్ మేజర్ హానరీ లెఫ్ట్ నెంట్ మాధవరావు బృందం సుబేదార్ రాజన్ సింగ్ పవార్, హవల్ దార్ డి. రాము హాజరై విద్యార్థులకు దేహధారుడ్య పరీక్షలు నిర్వహించారు.నలగొండ 3ఓ బెటాలియన్ కింద ఈ ఎన్.సి. సి యూనిట్ పనిచేస్తుందని తెలిపారు. ఎన్.సి .సి కి మొత్తంగా104 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని అందులో ఈ విద్యాసంవత్సరం 35 మంది మొదటి సంవత్సరం విద్యార్థ లను ఎంపిక చేశారు. విద్యార్థినులకు 33% రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఎన్ .సి .సి లో ప్రవేశం కోసం విద్యార్థులకు ఈరోజు ఎంపిక ప్రక్రియలోభాగంగా 1.2 కిలోమీటర్ల పరుగు పందెం,ఇతర శారీరక ధారుడ్య పరీక్షలు నిర్వహించి విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేశారు.నల్గొండ బెటాలియన్ లెఫ్ట్ నెంట్,కళాశాల ఎన్.సి. సి ఆఫీసర్ టి.రాజు విద్యార్థుల ఎంపిక ప్రక్రియలో కృషిచేశారు.ఈ కార్యక్రమానికి ఎన్.సి.సి' సి 'సర్టిఫికెట్ విద్యార్థి జి. ఉదయ్ హాజరై సహకారాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. చందా అప్పారావు కళాశాల ఫిజికల్ డైరక్టర్ ఫ్రాన్సిస్ మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి క్రీడల వైపు అడుగులు వేయాలి..

- విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచడమే లక్ష్యం.. కలెక్టర్, ఎస్పీ స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్..

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్- ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలు కీలకం..

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్

నల్గొండ, నవంబర్ 7 (ప్రజాజ్యోతి):

నేటి విద్యార్థులు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆలోచనలు, క్రీడాస్ఫూర్తిని పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.శనివారం నల్గొండలోని మేకల అభినవ్







స్టేడియంలో కలెక్టర్ ఎలెవన్, ఎస్పీ ఎలెవన్ జట్ల మధ్య నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. 12 ఓవర్ల మ్యాచ్‌లో ఎస్పీ జట్టు 118 పరుగుల తో విజయం సాధించగా, కలెక్టర్ జట్టు 107 పరుగులతో రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టుకు జిల్లా కలెక్టర్ ట్రోఫీ అందజేశారు. బెస్ట్ బౌలర్‌గా ఇరుగు రవి, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా శ్రీరామ్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా హరిబాబు ట్రోఫీలు అందుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యంగా 10 నుంచి 18 సంవత్సరాల వయస్సు పిల్లలు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు అలవాటు పడకుండా క్రీడల వైపు మళ్లాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతాయని, అధికారులకు కూడా ఇలాంటి పోటీలు మంచి అవకాశమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు



నిర్వహిస్తామని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, స్థానిక కార్పొరేటర్ అల్లి సుభాష్‌లు ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులు రూ.1.80 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, అడిషనల్ ఎస్పీ రమేష్, స్థానిక కార్పొరేటర్ సుభాష్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ పద్మ బాబుగౌడ్, చీఫ్ మేనేజర్ శ్రీరాములు, ఎస్‌బీఐ కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ ఆర్. సౌమిత, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్, కామెంటేటర్ గిరిబాబు, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వీర తెలంగాణ సాయుధ పోరాట గడ్డపై.. ఏఐకేఎస్ జాతీయ మహాసభలు

ప్రశ్నించే స్వరం, తిరుగుబాటు తత్వం, అమరవీరుల త్యాగాల పరంపరకు నల్లగొండ గడ్డ చిరునామాగా నిలిచింది.

ఈ నేలలో, ఈ గాలిలో పోరాటాల పరిమళం.. ప్రతి అణువులోనూ ఉద్యమాల చరిత్ర నిక్షిప్తమై ఉన్నాయి.అందుకే



నల్లగొండ నవంబర్ 7 (ప్రజా జ్యోతి ప్రతినిధి)

'నల్లగొండ' పేరు వినగానే గుర్తుకొచ్చేది పోరాటాల చరిత్రే! నిరంకుశత్వాన్ని ఎదిరించి, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సమరశంఖం పూరించిన వీరుల త్యాగాలకు ఈ నేల సజీవ సాక్ష్యం. ఇక్కడి ప్రతి పల్లె, వీచే గాలి, త్రాగే నీరు పండిన ప్రతి గింజ ఎర్రజెండా ఉద్యమాల చరిత్రను గుర్తుచేస్తాయి. పోరాటాల గడ్డగానే కాకుండా ప్రాచీన కట్టడాలు, విశిష్ట సాంస్కృతిక వారసత్వంతోనూ నల్లగొండ జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందింది.ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. 'భూమి కోసం.. భుక్తి కోసం.. విముక్తి కోసం' నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఈ మహాసంగ్రామంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగాన నిలిచింది. నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో, మూడు వేల గ్రామాలను భూస్వామ్య వ్యవస్థ నుంచి విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఎర్రజెండాది . ఆ విప్లవ చైతన్యానికి నల్లగొండ కేంద్రబిందువుగా నిలిచింది. సాయుధ పోరాటం నుంచి స్వరాష్ట్ర సాధన వరకు ప్రతి ఉద్యమంలో నూ తన పోరాట పటిమను చాటిన ఈ గడ్డపై ఇప్పుడు మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది.తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా కేంద్రంలో తొలిసారిగా నవంబర్ 15 నుంచి 18 వరకు 36వ అఖిల భారత కిసాన్ జాతీయ మహాసభలు జరగనున్నాయి. నాడు నైజాం నిరంకుశత్వంపై బందూకులు ఎత్తిన ఈ పోరాట నేలపై, నేడు రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభాలు, హక్కుల పరిరక్షణపై దేశవ్యాప్త చర్చకు వేదిక సిద్ధమవుతోంది. అమరవీరుల త్యాగాలతో పునీతమైన ఈ గడ్డ నుంచి పెల్లుబికే కిసాన్ సమరభేరి దేశ రైతాంగ ఉద్యమానికి నూతన దిశానిర్దేశం చేయబోతుంది. ..

తొమ్మిది దశాబ్దాల రైతాంగ పోరాట ప్రస్థానం

1936లో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఆవిర్భవించిన అఖిల భారత కిసాన్ సభ తొమ్మిది దశాబ్దాలుగా అన్నదాతల హక్కుల కోసం నిరంతరం పోరాడుతోంది. మరోవైపు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి 80 ఏళ్ల చారిత్రక సందర్భం తోడవడంతో ఈ మహాసభల ప్రాధాన్యత మరింత పెరిగింది. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో సుమారు నాలుగు వేల మంది ప్రాణత్యాగం చేశారు. మూడు వేల గ్రామాలకు విముక్తి లభించగా, పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేశారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ వంటి ఎందరో వీరుల పోరాటాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలిచాయి. అటువంటి ఘనమైన చరిత్ర కలిగిన తెలంగాణలోని నల్లగొండ జిల్లా కేంద్రంలో జాతీయ రైతు మహాసభలు నిర్వహించడం నాటి త్యాగాలకు నివాళి అర్పించడమే కాకుండా, భవిష్యత్ పోరాటాలకు గొప్ప స్ఫూర్తినివ్వనుంది.

అప్పుల ఊబిలో అన్నదాత.. ఆగని వ్యవసాయ సంక్షోభం

దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు తీవ్రమైన అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నాడు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, కరువులు, తెగుళ్లు పంటలను కోలుకోలేని విధంగా



దెబ్బతీస్తున్నాయి. పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని దుస్థితి నెలకొంది. అప్పుల భారం తట్టుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషాదం వ్యవసాయ రంగ సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోంది.ఈ పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. వ్యవసాయ రంగాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు ధారపోసే ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. విదేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రతికూల ప్రభావం దేశీయ రైతులపై తీవ్రంగా పడే ప్రమాదం ఉంది. పత్తి దిగుమతులపై సుంకాల తగ్గింపు, వంట నూనెల దిగుమతులను ప్రోత్సహించే నిర్ణయాలు దేశీయ పత్తి, నూనెగింజల రైతుల ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారాయి. విదేశీ ఉత్పత్తులతో పోటీపడలేక దేశీయ పంటలకు ధరలు పడిపోతుండటంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది.

మద్దతు ధరకు చట్టబద్ధత ఏదీ?

కేంద్రం 22 పంటలకు కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ, ఏ పంటకూ పూర్తిస్థాయి కొనుగోలు హామీ లేదు. గోధుమలు, వరి ఉత్పత్తిలో సగం కంటే తక్కువ పరిమాణమే ప్రభుత్వ సేకరణకు వస్తోంది. మిగిలిన పంటలను రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకే విక్రయించుకొని నష్టపోతున్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం లాభం కలిపి అన్ని పంటలకూ గిట్టుబాటు ధర కల్పించాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. దీనికి చట్టబద్ధ హామీ ఇవ్వడంతోపాటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను విస్తరించాల్సి ఉంది.ఢిల్లీ సరిహద్దుల్లో సాగిన చారిత్రక రైతాంగ ఉద్యమం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చింది. అయితే ఆందోళన విరమణ సందర్భంగా ఇచ్చిన కనీస మద్దతు ధర చట్టబద్ధత తదితర హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదు. విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ యత్నాలు కూడా రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్త ఐక్య ఉద్యమాలు అనివార్యంగా మారాయి.

తెలంగాణ రైతాంగాన్నీ వెంటాడుతున్న సమస్యలు

మరోవైపు తెలంగాణలోనూ రైతాంగం అనేక సమస్యలతో సతమతమవుతోంది. రుణమాఫీ అమలులో లోపాలు, రైతు భరోసా నిధుల జాప్యం, కౌలు రైతులకు గుర్తింపు లేకపోవడం, సాగునీటి కొరత, పంటల కొనుగోళ్లలో అవాంతరాలు అన్నదాతలను వెంటాడుతున్నాయి. పంట నష్టపోయిన వారికి పరిహారం సకాలంలో అందడం లేదు. సాగు ఖర్చులన్నీ భరించే కౌలు రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు దక్కడం లేదు. రైతుల సమస్యలను కేవలం రాజకీయ హామీలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిష్కరించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ కార్మికులకు ఉపాధి



భద్రత, మహిళా రైతులకు గుర్తింపు, కౌలు రైతులకు చట్టబద్ధ హక్కులు కల్పించాల్సి ఉంది.

28 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు

ఈ తరుణంలో కోటి 58 లక్షల మంది సభ్యులతో దేశంలోనే అతిపెద్ద రైతు సంఘంగా కొనసాగుతున్న అఖిల భారత కిసాన్ సభ మహాసభలకు 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1,200 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. గత మూడున్నరేళ్లలో దేశవ్యాప్తంగా జరిగిన రైతు ఉద్యమాలు, వాటి విజయాలు, ఎదురైన సవాళ్లపై సుదీర్ఘంగా సమీక్షించడంతోపాటు రాబోయే మూడేళ్లకు అవసరమైన బృహత్తర కార్యాచరణను ఈ మహాసభలు స్పష్టంగా రూపొందించనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలు, వాణిజ్య ఒప్పందాల ప్రభావం, కనీస మద్దతు ధర చట్టబద్ధత, రైతుల రుణ విముక్తి, విద్యుత్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం, కౌలు రైతుల సమస్యలపై ఇక్కడ సమగ్రంగా చర్చించనున్నారు.ఈ చారిత్రక మహాసభల్లో ఆమోదించే కీలక తీర్మానాలు గ్రామస్థాయి నుంచి ఢిల్లీ వరకు రైతాంగ ఉద్యమాలను మరింత సమర్థవంతంగా బలోపేతం చేయనున్నాయి. రైతులను సంఘటితం చేస్తూ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళా శక్తులను కలుపుకొని బలమైన పోరాటాలకు ఇవి శ్రీకారం చుట్టబోతున్నాయి. పాలకుల విధానాల్లో స్పష్టమైన మార్పు తెచ్చేలా నిరంతర ప్రజా పోరాటాల ప్రణాళికలను ఇక్కడ ఆవిష్కరించనున్నారు. దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక వర్గాల ఐక్యతను చాటుతూ భవిష్యత్ సమరానికి ఈ మహాసభలు సన్నద్ధమవుతున్నాయి. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ నల్లగొండ మహాసభలు సమరశీల ఉద్యమాలకు దిక్సూచిగా నిలవబోతున్నాయి.

ఎర్రజెండాలతో నల్లగొండలో రైతు కదనోత్సాహం

మహాసభల ప్రారంభ సూచికగా నవంబర్ 15న నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు లక్షలాది మంది రైతులు కదం తొక్కనున్నారు. వేలాది మంది యువ కార్యకర్తలతో నిర్వహించే 'రెడ్ మార్చ్' నల్లగొండ నడిబొడ్డున ఎర్రజెండాల శోభను సంతరించుకోనుంది. నవంబర్ 14 నుంచి 17 వరకు వ్యవసాయ ప్రదర్శన, మూడు రోజులపాటు సాగే సాంస్కృతిక ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.దేశవ్యాప్త రైతు నాయకులు పాల్గొనే ఈ మహాసభ రైతాంగ ఐక్యతను ప్రపంచానికి చాటనుంది. "ప్రతి పల్లె నుంచి ఇంటికో మనిషి.. ఊరికో బండి"గా నల్లగొండ బహిరంగ సభకు రావాలన్న పిలుపుతో అన్నదాతలు సమరానికి సన్నద్ధమవుతున్నారు. ఎర్ర చొక్కాలు ధరించి, ఎర్రజెండాలు చేతబూని నల్లగొండను మరోసారి 'ఎర్రగొండ'గా మార్చబోతున్నారు. దీంతో విప్లవాల ఖిల్లాగా నల్లగొండ పేరు దేశవ్యాప్తంగా మరోసారి మారుమోగనుంది.

రైతు బహిరంగ సభను జయప్రదం చేయండి

చిట్యాల నవంబర్ 7 ప్రజా జ్యోతి



అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేయస్) 36 వ మహాసభల సందర్భంగా ఈ నెల 15 న నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే రైతు బహిరంగ సభను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి విజ్ఞప్తి చేశారు. చిట్యాల మండల కేంద్రంలోని స్థానిక మేకల లింగయ్య స్మారక భవనంలో శనివారం నాడు జరిగిన రైతు సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.అఖిల భారత మహాసభల సందర్భంగా ఈ నెల 14 న జరిగే అగ్రి షో లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు హాజరు కానున్నట్లు తెలిపారు.రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట గడ్డ నల్లగొండ లో చారిత్రక సభలు విజయవంతం చేయాలని కోరారు.జిట్ట నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు అవిశెట్టి శంకరయ్య, చింతపల్లి బయ్యన్న, కుమ్మరి శంకర్,చెర్కు పెద్దులు, కత్తుల లింగస్వామి,యస్ ఆర్ వెంకటేశ్వర్లు, అరూరి శ్రీను,ఆమనగంటి ఐలయ్య,చిలుముల రామస్వామి, మురారి మోహన్, పామును గుళ్ళ అచ్చాలు, శీలా రాజయ్య, ఐతరాజు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

చండూరులో అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి ఆలయ విగ్రహాల ఊరేగింపు

నల్లగొండ: నవంబర్ 7 (ప్రజా జ్యోతి ప్రతినిధి)







చండూరు మున్సిపాలిటీలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించేందుకు తీసుకొచ్చిన అయ్యప్ప స్వామి, గణపతి, కుమారస్వామి విగ్రహాలతో పాటు ధ్వజస్తంభానికి శనివారం ఘన స్వాగతం పలికారు. వేలాది మంది అయ్యప్ప భక్తుల మధ్య భజనలు, తాళాల నడుమ స్వామి శరణుఘోషతో విగ్రహాలను అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తుల అయ్యప్ప నామస్మరణతో చండూరు పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశమును కలిసిన దేవస్థానం మాజీ ధర్మకర్త రాధా బిక్షపతి

నార్కట్ పల్లి, నవంబర్ 7 (ప్రజా జ్యోతి):

శుక్రవారం రోడ్డు ప్రమాదం జరగగా, ఈ ప్రమాదంలో ఎమ్మెల్యేతో పాటు కాన్వాయ్ లో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ఈ విషయం తెలుసుకున్న విశ్రాంతి ఉపాధ్యాయులు, చెరువుగట్టు దేవస్థానం మాజీ ధర్మకర్త, తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం , అధ్యక్షులు రాదరపు బిక్షపతి, మాజీ ఎంపీటీసీ, చెరువుగట్టు దేవస్థానం మాజీ ధర్మకర్త రాధారపు విజయలక్ష్మి ఎమ్మెల్యే వేముల వీరేశం మర్యాదపూర్వకంగా కలిసి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



గ్రామంలో అండర్ డ్రైనేజీ మంజూరు చేయాలి

- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కలిసిన సర్పంచ్ రేణుక నరసయ్య

ఆలేరు నవంబర్ 7 (ప్రజా జ్యోతి)



మందనపల్లి చెరువు నిండుటకు కందిగడ్డ తండ వద్ద కెనాల్ పూర్తితో పాటు గ్రామంలో అండర్ డ్రైనేజీ మంజూరు చేయాలని సర్పంచ్ రేణుక నరసయ్య ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ను శనివారం కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందానపల్లి గ్రామ అభివృద్ధి పనులపై సాంక్షన్ చేసిన ఇందిరమ్మ ఇండ్ల మీదికి వెళ్లిన పాత లైన్ 30 సంవత్సరాల నుండి పడుతున్న బాధలను తీర్చిన ప్రజల బాంధవుడు కరెంటు లైన్ 11 కెవి షిఫ్టింగ్ పనులు పూర్తి చేసినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. గ్రామానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఐలయ్య మాట్లాడుతూ గ్రామానికి అన్ని విధాల అండగా ఉంటూ సహకరించుకుంటూ అభివృద్ధిలో ముందంజలో ఉండే విధంగా గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శశిరేఖ, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్కూరు సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన ట్రస్మా పోచంపల్లి కమిటీ

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 7 (ప్రజాజ్యోతి):

ట్రస్మా పోచంపల్లి మండల నూతన అధ్యక్షుడిగా పంతంగి భాస్కరాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎడ్డి తిరుమల్ రెడ్డి, కోశాధికారిగా కటిక రెడ్డి దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సామిని భాస్కర్, పారిపల్లి విశ్వనాథ్, కార్యవర్గ సభ్యులుగా విశాల్, బుగ్గి లాస్య లింగమూర్తి ఎన్నికయ్యారు. నూతన కమిటీ రెండేళ్లపాటు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాలకూర వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కోశాధికారి వంగూరి పాండు తదితరులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు, నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

నల్లగొండ నవంబర్ 7 (ప్రజా జ్యోతి ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు నల్లగాటి ప్రసన్న రాజ్ రాష్ట్ర ప్రజలకు, నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగను ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. ప్రతి ఇంటా ఆనందాల దీపాలు వెలగాలని, రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని నల్లగాటి ప్రసన్న రాజ్ ఆకాంక్షించారు.



గ్రామ మేటీలకు శిక్షణ

- ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్

ఆలేరు నవంబర్ 7 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వి బి జి ఆర్ ఏ ఎం జి లో భాగంగా పలు గ్రామాలకు చెందిన మేటీలకు ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అన్ని గ్రామాలలో 40 మంది కూలీలకు ఒక మేటిని నియమించి వారు కూలీలకు ఎన్.ఎం.ఎస్ అటెండెన్స్ రెండుసార్లు నమోదు చేయడం కొలతలు ప్రకారం కూలీలతో పని చేయించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్పి బాలు, ఏపీఓ అరుణకుమారి, ఇన్చార్జి ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ వై రామచంద్రయ్య చారి, టెక్నికల్ అసిస్టెంట్ మానస తదితరులు పాల్గొన్నారు.





దూడల ఆరోగ్య సంరక్షణలో నట్టల నివారణ మందులు ఎంతో కీలకము

ఆలేరు నవంబర్ 7 (ప్రజా జ్యోతి)

దూడల ఆరోగ్య సంరక్షణలో నట్టాల నివారణ మందులు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయని వీటి వల్ల దూడలు ఆరోగ్యంగా ఎదిగి పశు సంపాద వృద్ధి చెందుతుందని షారాజీపేట పశు వైద్యాధికారి యాకుబ్ అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని గొలనుకొండ ,శర్బనాపురం గ్రామాలలో దూడల నట్టాల నివారణ కార్యక్రమం నిర్వహించి ఈ సందర్భంగా 75 దూడలకు ఉచితంగా నటల నివారణ మందులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదిరెడ్డి, మదర్ డైరీ పాల సెంటర్ చైర్మన్ పరశురాములు, నరసింహ సుధాకర్ కుమారస్వామి శ్రీకాంత్ గోపి రైతులు తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల పోరాట స్ఫూర్తితో దోపిడీ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుదాం

- మందనపల్లి లో అమరవీరుల సంస్మరణ సందర్భంగా

ఎర్రజెండాను ఆవిష్కరించిన కామ్రేడ్ కర్రె స్వామి

ఆలేరు నవంబర్ 7(ప్రజా జ్యోతి)





కేంద్రంలో బీ జే పీ మోడీ ప్రభుత్వం,రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు ప్రజా,రైతు,కార్మిక వ్యతిరేక విధానాలను అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఎండగట్టాలని, అందుకు ప్రజలు పోరాటాల్లోకి ముందుకు రావాలని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్ అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందనపల్లి లో అమరవీరుల సంస్మరణ సందర్భాన్ని పురస్కరించుకుని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ గ్రామ సీనియర్ నాయకుడు కర్రె స్వామి ఆవిష్కరించాడు.అమరవీరులకు నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన సభ లో సహదేవ్ మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడి అమరత్వం పొందిన అమర వీర యోధులు నిత్యం ప్రజా పోరాటాలలో,ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉత్తేజాన్ని,చైతన్యాన్ని అందిస్తారని అన్నారు.ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఆరోపించారు.ప్రజా ఆకర్షిత హామీలను ఇవ్వడమే తప్ప ఆచరణ ఉండదని స్పష్టం చేశారు.గత 70 సంవత్సరాలుగా అధికారాన్ని వెలగబెడుతున్న పాలకులు ప్రజలకు అందుబాటులో ఉండకుండా,సమస్యలను పరిష్కరించకుండా డంబాచారమేనని, అరచేతిలో వైకుంఠాన్ని చూపడం తప్ప వీరి పాలనలో మారేమిలేదని విమర్శించారు.కమ్యూనిస్టు విప్లవకారులు దేశంలో దున్నే వారికే భూమి నినాదాన్ని దేశమంతా వ్యాపింపజేసారని లక్షల ఎకరాల భూములను ప్రజా పోరాటాల ద్వారా ప్రజలు సాధించుకున్నారని అన్నారు.అందుకే ప్రజలకు విప్లవమే ప్రత్యామ్నాయం తప్ప దోపిడీ పాలక వర్గ పార్టీలు ఎంతమాత్రం కాదని,ప్రజలు విప్లవ పార్టీ వెనకాల సమీకృతం కావాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఎం. ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్దన్, జిల్లా నాయకులు కల్లెపు అడివయ్య,ఆర్.సీత, మందనపల్లి ఉప సర్పంచ్ పద్మ శశిరేఖ, పీ ఓ డబ్ల్యూ జిల్లా నాయకురాలు తమ్మడి ఉమా,పీ వై ఎల్ జిల్లా అధ్యక్షుడు మారుజోడు సిద్దేశ్వర్,నాయకులు మామిడాల బాల మల్లేష్,ఆర్.ఉదయ్, తమ్మడి అంజయ్య, తమ్మడి రమేష్, దార యాదగిరి,పుర్మ చంద్రయ్య, కుర్రి మార్కండేయ, సుంచు రాములు తదితరులు పాల్గొన్నారు .

రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కార్!

- ఎండిపోయిన పంటలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి

- యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించడం ప్రభుత్వ మూర్ఖత్వం

- మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

హాలియా, నవంబర్ 7 (ప్రజా జ్యోతి):

రేవంత్ రెడ్డి అసమర్థ విధానాల వల్ల రాష్ట్రంలోని రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. శనివారం హాలియాలోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.సాగునీరు అందిస్తామని, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నమ్మి రాష్ట్రంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేశారని భగత్ కుమార్ తెలిపారు. అయితే పంటలు సాగు చేసిన అనంతరం ఎల్‌నినో ప్రభావాన్ని సాకుగా చూపుతూ ప్రభుత్వం సాగునీరు సక్రమంగా అందించకపోవడం, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా చేయకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.యాసంగి సీజన్‌లో రైతులు పంటలు సాగు చేయవద్దని సూచించడంతో పాటు క్రాప్ హాలిడే ప్రకటించడం ప్రభుత్వ మూర్ఖత్వానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటిస్తే వ్యవసాయంపై ఆధారపడిన రైతులు, వ్యవసాయ కూలీలు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. నాగార్జునసాగర్ జలాశయంలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ గత వర్షాకాలంలో రైతులకు సక్రమంగా సాగునీరు అందించలేదని, ఇప్పుడు యాసంగిలో పంటలు వేయవద్దని చెప్పడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. రైతులు, వ్యవసాయ కూలీల ఏడాది పొడవునా జీవనోపాధికి ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని నిలదీశారు. రబీ సీజన్‌లో వ్యవసాయానికి ఎన్ని గంటల విద్యుత్ సరఫరా చేస్తారో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.మరోవైపు మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ అండదండలతోనే మిల్లర్లు కుమ్మక్కై రైతులకు కనీస మద్దతు ధర కూడా చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సీజన్ ప్రారంభంలో క్వింటాల్ ధాన్యానికి రూ.4,500 వరకు చెల్లించిన మిల్లర్లు ప్రస్తుతం సిండికేట్‌గా మారి కేవలం రూ.2,700 మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రైతుల శ్రమను దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడేళ్ల పాలన పూర్తిగా అస్తవ్యస్తంగా



సాగుతోందని భగత్ కుమార్ విమర్శించారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాననీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధిని పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో నియోజకవర్గానికి జరిగిన అభివృద్ధి శూన్యమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులకే ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేస్తోందని, కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులు ఏవీ లేవని విమర్శించారు.గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులను సైతం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోతోందని ఆరోపించారు.హాలియా మున్సిపాలిటీలోని నాలుగో వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్‌కు మున్సిపల్ కమిషనర్ తగిన గుర్తింపు,గౌరవం కల్పించకుండా, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని భగత్ కుమార్ ఆరోపించారు. ఈ సమస్యపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తే, దానిని కాంగ్రెస్ నాయకులు వక్రీకరిస్తూ అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజాప్రతినిధులందరికీ సముచిత గౌరవం కల్పించాలని, రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులకు సమానంగా అభివృద్ధి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు,నల్లగొండ సుధాకర్,వడ్డే సతీష్ రెడ్డి, పొదిల శ్రీనివాస్,కర్న నర్సిరెడ్డి, కడమంచి శ్రీను,చిట్టిప్రోలు శ్రీనివాస్,సర్పంచ్ కూన్ రెడ్డి భాస్కర్ రెడ్డి,అన్నేపాక శ్రీనివాస్, చేగొండి కృష్ణ యాదవ్,సురభి రాంబాబు,రావులపాటి ఎల్లయ్య,బొల్లం శ్రీనివాస్ యాదవ్ తదితర బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్తిక మాసంలో పంచారామ క్షేత్రాలకు స్పెషల్ బస్సులు

నల్లగొండ, నవంబర్ 7 :(ప్రజా జ్యోతి ప్రతినిధి)

నల్లగొండ: కార్తిక మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం నల్లగొండ డిపో నుండి పంచారామ క్షేత్రాలకు ప్రతి ఆదివారం సాయంత్రం స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు నల్లగొండ డిపో మేనేజర్ మేరీ లావణ్య తెలిపారు.ప్రతి ఆదివారం సాయంత్రం 7.00 గంటలకు బయలుదేరే ఈ బస్సుల ద్వారా భక్తులు సోమవారం దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు.

బస్సులు బయలుదేరే తేదీలు :

నవంబర్ 08, 15, 22, 29 మరియు డిసెంబర్ 06టికెట్ ధరలు :పెద్దలకు - రూ. 2000 /- మాత్రమేపిల్లలకు - రూ. 1300 /- మాత్రమేకావున భక్తులు, ప్రయాణికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మేరీ లావణ్య కోరారు.9063405696, 9959844918 ఈ నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

ఎస్ఆర్ఎం సంకల్పంలో పర్యావరణ హితంగా గ్రీన్ దీపావళి

టపాసులకు దూరంగా ఉంటూ మొక్కలు నాటిన విద్యార్థులు

- ప్రకృతికి హాని కలిగించకుండా పండుగ జరుపుకోవాలి

చైర్మన్ కేసినేని శ్రీదేవి

కోదాడ టౌన్, నవంబర్ 07 (ప్రజా జ్యోతి):

కోదాడ పట్టణంలోని స్థానిక ఎస్ఆర్ఎం సంకల్ప్ పాఠశాలలో విద్యార్థులు ముందస్తు దీపావళి వేడుకలను శనివారం పాఠశాల ఆవరణలో పర్యావరణ హితంగా నిర్వహించారు. టపాసుల వల్ల కలిగే వాయు, శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు క్రాకర్స్‌కు దూరంగా ఉంటూ ప్రాంగణంలో మొక్కలు నాటి గ్రీన్ దీపావళికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కేసినేని శ్రీదేవి మాట్లాడుతూ పండుగ ఆనందం ప్రకృతికి హాని కలిగించేలా ఉండకూడదని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. చిన్నారుల్లో పర్యావరణ స్పృహ, సామాజిక బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్రాకర్స్ వద్దు, మొక్కలు ముద్దు పచ్చదనమే మన భవిష్యత్తుకు వెలుగు అనే సందేశంతో విద్యార్థులు ప్రజలందరికీ గ్రీన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.





రైతు భరోసా అమలేది?

- హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ

మాజీ డైరెక్టర్ గుగులోతు నీలా హేమ్లా నాయక్

గరిడేపల్లి,నవంబర్ 7 (ప్రజా జ్యోతి):



రైతులకు పెట్టుబడి సాయం అందించాల్సిన రైతు భరోసా పథకం ఆచరణలో కనిపించడం లేదని హుజూర్‌నగర్ వ్యవసా య మార్కెట్ కమిటీ మాజీ డైరె క్టర్,గిరిజన నాయకుడు గుగులో తు నీలా హేమ్లా నాయక్ విమ ర్శించారు.రైతు భరోసా పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోంద ని,యాసంగి సీజన్‌కు సంబంధిం చిన పెట్టుబడి సాయంపై ఇప్పటి కైనా స్పష్టమైన ప్రకటన చేయాల ని డిమాండ్ చేశారు.ఓవైపు నీటి ఎద్దడి మరోవైపు విద్యుత్ కోతల తో రైతులు సాగు చేసిన పంట లు ఎండిపోతున్నాయని ఆవేద న వ్యక్తం చేశారు.పత్తి,వరి,మొ క్కజొన్న,కంది తదితర పంటలు నీరందక దెబ్బతింటున్నాయని తెలిపారు.ప్రకృతి పరిస్థితులు అనుకూలించక,సాగు పెట్టుబడు లు చేతికందక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని పేర్కొన్నారు.కేసీఆర్ హ యాంలో రైతులు ఆత్మగౌరవంతో వ్యవసాయం చేసుకునే పరిస్థితి ఉండేదని,నేడు పెట్టుబడి సాయం కోసం ప్రభుత్వ ప్రకటన ల వైపు ఎదురుచూడాల్సి వస్తోం దని అన్నారు.కరువు పరిస్థితుల ను దృష్టిలో ఉంచుకొని రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందిం చాలని కోరారు.రైతు భరోసా ఎప్పుడు జమ చేస్తారో స్పష్టం చేయడంతో పాటు పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి బాధిత రైతులకు పరిహారం అందించాలని గుగులోతు నీలా హేమ్లా నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిర్యాలగూడ, నవంబర్ 07,(ప్రజాజ్యోతి):



మిర్యాలగూడ మండలం యాద్గార్ పల్లి శివారులో శనివారం ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై ఉప్పు నగేష్ తెలిపారు. ఎస్సై తన సిబ్బందితో ఆకస్మికతనిఖీలు చేస్తుండగా కామేపల్లిగూడెం మూసీ నది నుండి మిర్యాలగూడ వైపు అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని విచారించగా ట్రాక్టర్ల డ్రైవర్లు తడకమళ్ళ గ్రామానికి చెందిన చందు, పేరయ్య లపై ట్రాక్టర్ యజమానులు కామేపల్లి గూడెంకు చెందిన వారిపై కూడా కేసు నమోదు చేసి డాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నగేష్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి వారిని తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేయటం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యే క్షేమం కోసం శివాలయంలో ప్రత్యేక పూజలు

చిట్యాల నవంబర్ 07(ప్రజా జ్యోతి);





నకిరేకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ మరియు ఉద్దీపన చైర్మన్ వేముల వీరేశం ఇటీవల జరిగిన ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడిన సందర్భంగా చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మి నర్సింహ ఆధ్వర్యంలో చిట్యాల మండలం ఎలికట్టే గ్రామంలోని శివాలయంలో ఎలికట్టే గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వేముల వీరేశం పేరు మీద అభిషేకం చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. భగవంతుని ఆశీస్సులతో వారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. అనంతరం నాయకులతో కలిసి వెళ్లి నకిరేకల్ పట్టణంలో వేముల వీరేశంను వారి నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎలికట్ట గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటం వెంకన్న, గ్రామ సర్పంచ్ సాగర్ల యాదమ్మ యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండ ఎల్లయ్య గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండ కింది అశోక్ రెడ్డి, వార్డ్ నెంబర్లు చర్లపల్లి లింగస్వామి, గడి గల కోటేష్, మాజీ సర్పంచ్ గుండె పద్మా నరసింహ, సీనియర్ నాయకులు కొండ రాములు, గుడిపాటి అశోక్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు నాగార్జున యాదగిరి చారి, కొండ శ్రీనివాస్ గౌడ్, మాజీ వార్డ్ నెంబర్లు ఉయ్యాల పెంటయ్య, ఉయ్యాల స్వామి, కొండ ఎంకన్న, గడిగల శేఖర్, యూత్ కాంగ్రెస్ నాయకులు పరిషబోయిన క్రాంతి, బద్దుల మహేష్, పూజాల నవీన్ కుమార్ గౌడ్, పోలగోని రాములు, మూడుదిట్ల శ్రీశైలం, ఉస్కిల్ల రవి, చుక్క కృష్ణ, సాగర్ల ముసలయ్య, మహమ్మద్ షేక్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న వెజ్–నాన్‌వెజ్ మార్కెట్ పనులు వెంటనే పూర్తి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్లగొండ నవంబర్ 7 (ప్రజా జ్యోతి ప్రతినిధి)





నకిరేకల్‌లో నిర్మాణంలో ఉన్న వెజ్–నాన్‌వెజ్ మార్కెట్ సముదాయాన్ని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రూ.2 కోట్ల వ్యయంతో 2021లో మార్కెట్ సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కూరగాయలు, చేపలు, చికెన్, మటన్ విక్రయించే వ్యాపారులు రోడ్లపై ఎండకు, వానకు ఇబ్బందులు పడకుండా ఒకే చోట అన్ని మార్కెట్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో నిర్మాణాలు చేపట్టామన్నారు. కరోనా సమయంలోనూ పనులు కొనసాగించామని, నిధులు మంజూరై సుమారు 50 శాతం పనులు పూర్తయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులు నిలిచిపోయాయని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవ తీసుకొని పెండింగ్ పనులు పూర్తి చేయకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. మార్కెట్ నిర్మాణాలు పూర్తికాకపోవడంతో వ్యాపారులు, ప్రజలు రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా చేపల మార్కెట్ వద్ద నీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేక వ్యాపారులు అవస్థలు పడుతున్నారని తెలిపారు.

గ్రీన్ గ్రోవ్ లో దీపావళి వేడుకలు

చిట్యాల నవంబర్ 07 (ప్రజా జ్యోతి):



నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ముందస్తు దీపావళి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేయగా పాఠశాల ఆవరణను దీపాలతో అందంగా అలంకరించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పూలకంటి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకే దీపావళి అని తెలిపారు. దీపావళి అంటే కేవలం బాణసంచా కాదని, మనలోని అజ్ఞానం, అహంకారాన్ని తొలగించుకుని మంచి మార్గంలో నడవాలనే సందేశం ఉందని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను చిన్ననాటి నుంచే విద్యార్థులకు తెలియజేయాలని, పర్యావరణానికి హాని లేకుండా కాలుష్యరహిత దీపావళి జరుపుకోవాలని సూచించారు. దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో ముందస్తు దీపావళి సందడి

చిట్యాల నవంబర్ 07 (ప్రజా జ్యోతి):



చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో దీపావళి ముందస్తు సంబరాలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా పండుగను ఆనందంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత భద్రతను తప్పక పాటించాలని పాఠశాల కరస్పాండెంట్ పెద్ది నరేందర్ విద్యార్థులకు సూచించారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, భారతీయ పండుగల విశిష్టతను తెలుసుకోవాలని, ఉన్నత లక్ష్యాలతో జీవితంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపే పండుగ దీపావళి అని తెలిపారు. పాఠశాల ప్రాంగణాన్ని దీపాలతో అందంగా అలంకరించగా విద్యార్థులు టపాకాయలు కాల్చి ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ఎస్. జ్యోతి, షేక్ షమీం, ఎం. ధనలక్ష్మి, పి. రమాదేవి, ఎన్. మాధవి, కె. మౌనిక, సంపూర్ణ, డి. శిరీష, లింగస్వామి, బి. సుకన్య, బి. సంతు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా నిలిచిన యువశక్తి యువజన సంఘం

చిట్యాల నవంబర్ 07 (ప్రజా జ్యోతి):

చిట్యాల మున్సిపాలిటీ 10వ వార్డు వాసి మీసాల కిషన్ (52) హఠాత్తుగా కన్నుమూశారు. సమాచారం అందుకున్న వెంటనే యువశక్తి యువజన సంఘం సభ్యులు ఆయన నివాసానికి చేరుకుని పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శోకంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబ పోషణకు తోడుగా రూ.10 వేల నగదును అందించి మానవత్వం చాటారు. మున్సిపాలిటీలో అంకితభావంతో విధులు నిర్వహించిన కిషన్ లేని లోటు కుటుంబానికి తీరనిదని, బాధిత కుటుంబానికి తమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ తో పాటు యువశక్తి సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



ప్రజలకు మెరుగైన రహదారుల కల్పనే ధ్యేయం.!

- కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ - సైదులు

హాలియా,నవంబర్ 7 (ప్రజా జ్యోతి)



ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వార్డులో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నామని హాలియా 2వ వార్డు కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ సైదులు తెలిపారు. వార్డు అభివృద్ధే ధ్యేయంగా ప్రతి సమస్యను గుర్తించి,వాటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం 2వ వార్డు పరిధిలో దేవేందర్ ఇంటి నుండి సుమంగళి ఫంక్షన్ హాల్ వరకు చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పనుల నాణ్యతా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు,కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సహకారంతో,మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి సమన్వయంతో వార్డులో పలు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే వార్డు ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే బురద,ఇతర ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వెల్లడించారు.ప్రజల అవసరాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా వార్డులోని అన్ని మౌలిక వసతులను మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు,ఫసియుద్దీన్, వర్కాల మల్లారెడ్డి,పగడోజు సైదాచారి,దేవేందర్,రాపోలు సంతోష్,అక్బర్,సంతోష్ కుమార్,షఫీ,శ్రీనివాస్ రెడ్డి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వంతో స్పందించిన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

మిర్యాలగూడ, నవంబర్ 07,(ప్రజాజ్యోతి):



ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమావేశానికి జన సమీకరణకు సంబంధించి పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తో కలిసి సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు.డీసీఎం -- టిప్పర్ వాహనాలు ఢీకొన్న ప్రమాదాన్ని చూసిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్ హుటాహుటిన తన కారును ఆపి, తన గన్‌మెన్ సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. వెంటనే అంబులెన్స్‌లను పిలిపించి, ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేలా చొరవ చూపించారు.ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, డీసీఎంలో ప్రయాణిస్తున్న ఒడిశాకు చెందిన డెకరేషన్ పనివారు సుమారు ఏడుగురు గాయపడటంతో వారిని అంబులెన్స్‌ల ద్వారా ఆసుపత్రికి తరలించారు.ముఖ్యమంత్రి సమావేశానికి వెళ్తున్నసమయంలోనూ, ప్రమాదాన్ని చూసి తన ప్రయాణాన్ని పక్కనపెట్టి క్షతగాత్రులకు తక్షణ సహాయం అందించేందుకు ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ చూపిన చొరవ, మానవత్వం అభినందనీయం. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి, బాధ్యతగల ప్రజాప్రతినిధిగా మానవతా విలువలను చాటుకున్న ఎమ్మెల్సీ సేవా దృక్పథం ప్రశంసనీయమని ఔటర్ ప్రయాణికులకు, ప్రజలు అభినందించారు.

పంటల నష్టంపై వివరాల సేకరణ

చింతలపాలెం, నవంబర్ 7 (ప్రజా జ్యోతి) :

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోయిన వరి, పత్తి పంటల నష్టం వివరాల సేకరణకు వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. క్షేత్రస్థాయిలో పంటల వాస్తవ పరిస్థితులను పరిశీలించి నష్టం అంచనా వేసేందుకు వివరాలు సేకరిస్తున్నారు. చింతలపాలెం మండలంలోని ఎండిపోయిన వరి, పత్తి పంటలకు సంబంధించిన వివరాలను బాధిత రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలని మండల వ్యవసాయ అధికారి శశాంక్ ఒక ప్రకటనలో సూచించారు. రైతులు అందించిన వివరాల ఆధారంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. మండల వ్యవసాయ శాఖలో ఒకే ఒక్క వ్యవసాయ విస్తరణ అధికారి అందుబాటులో ఉన్నందున రైతులు చింతలపాలెం రైతు వేదిక వద్ద అధికారిని నేరుగా కలిసి పంట నష్టం వివరాలు అందించాలని కోరారు.

టీడీపీ విజయంతో గరిడేపల్లిలో సంబరాలు

గరిడేపల్లి,నవంబరు 7 (ప్రజా జ్యోతి):

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని కూటమి సాధించిన విజయంతో గరిడేపల్లి మండల కేంద్రంలో టీడీపీ శ్రేణులు సంబ రాలు జరుపుకున్నారు.శని వారం మండల కేంద్రంలో బాణ సంచా కాల్చి,ఆనందోత్సాహాల మధ్య తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు కీసరి నాగ య్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో కూటమి సాధించిన విజయంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంద న్నారు.రానున్న రోజుల్లో తెలంగాణలోనూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు,కార్యకర్తలు సమష్టి గా కృషి చేయాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాతకోటి లింగారెడ్డి, పాశ్యా సీతారామిరెడ్డి,షేక్ రాజ మధు,యరగొర్ల నరసింహ, గంధం కృష్ణమిడసనమెట్ల వీరయ్య,మోదాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్ లో సత్తా చాటిన ఎస్సీ గురుకుల విద్యార్థులు

రాష్ట్రస్థాయి మీట్ కు 24 మంది విద్యార్థులు ఎంపిక

మిర్యాలగూడ, నవంబర్ 07,(ప్రజాజ్యోతి):

ఈనెల 4 నుండి 6వ తారీకు వరకు జనగాం జిల్లాలో జరిగిన 12వ, జోనల్ స్పోర్ట్స్ సెలక్షన్లో మిర్యాలగూడ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు కబడ్డీ , ఖోఖో, వాలీబాల్ బాల్ బ్యాడ్మింటన్ అథ్లెటిక్స్ విభాగాలలో 24 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి జోనల్ మీట్ కి సెలెక్ట్ కావడం జరిగింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి జోన్ మీట్ లో కూడా మరిన్ని విజయాలు విద్యార్థులు సాధించాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఐ. క్రిష్ణ నాయక్ ,పి ఈ టి స్వామి, పీడీ లక్ష్మణ్ మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.



నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి

ఎన్ హెచ్ ఎం జేఏసీ వినతి

భువనగిరి,నవంబర్ 7 (ప్రజాజ్యోతి)



నేషనల్ హెల్త్ మిషన్ (పరిధిలో,వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా జేఏసీ నాయకులు కోరారు.ఈ మేరకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత తదితర ప్రధాన డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.భువనగిరి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన,ఎమ్మెల్యే,ఉద్యోగుల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా,నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు జేఏసీ యాదాద్రి జిల్లా అధ్యక్షులు షాహిద్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు నిరంతర వైద్య సేవలందిస్తు న్నప్పటికీ,న్యాయమైన హక్కులు ఇంకా నెరవేరకపోవడం విచారకరమని అన్నారు.ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు.అలాగే మా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జేఏసీ పక్షాన పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

కృష్ణవేణి పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు

రామన్నపేట నవంబర్ 7 (ప్రజా జ్యోతి)





రామన్నపేట మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ముందస్తు దీపావళి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. దీపావళి పండుగను కాలుష్య రహితంగా జరుపుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా తీసుకోవలసిన పలు జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల మైదానంలో దీపావళి పండుగను పురస్కరించుకొని పలు భంగిమల ఆకారంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి. సురేష్, అకాడమీ డైరెక్టర్ జెవిఎన్ఎస్ మణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీపావళి వేళ "అప్రమత్తతే శ్రీరామరక్ష"

- క్షణిక ఆనందం కోసం జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టొద్దు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 7 (ప్రజాజ్యోతి):



దీపావళి పండుగ అంటేనే వెలుగులు, ఆనందాలు, సంబరాలు. చిన్నారుల కేరింతలు, బాణసంచా వెలుగులతో ప్రతి ఇల్లు పండుగ శోభను సంతరించుకుంటుంది. అయితే ఈ ఆనందాల వేళ ప్రతి ఒక్కరూ విద్యుత్ వెలుగులతో, టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ప్రజలు గుర్తించాలి.ముఖ్యంగా చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలి. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, ఇళ్ల సమీపంలో బాణసంచా పేల్చకూడదు. చేతిలో టపాసులు పెట్టుకుని కాల్చడం, పేలని టపాసులను మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయడం వంటివి చేయకూడదు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగితే వెంటనే స్పందించేందుకు నీళ్లు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి.అంతేకాకుండా అధిక శబ్దం, పొగతో వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలి. పర్యావరణానికి హాని కలగకుండా బాధ్యతాయుతంగా పండుగను జరుపుకోవాలి. మన ఆనందం ఇతరులకు ఇబ్బందిగా మారకూడదు.పండుగ అంటే ప్రాణాలను పణంగా పెట్టి సంబరాలు చేసుకోవడం కాదు.. కుటుంబ సభ్యులందరితో కలిసి సురక్షితంగా ఆనందాన్ని పంచుకోవడం. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి ప్రమాదరహిత దీపావళిని జరుపుకోవాలి. దీపావళి వెలుగులు ప్రతి ఇంటా సంతోషాలను నింపాలి కానీ, ఎవరి జీవితాల్లోనూ ప్రమాదాల చీకట్లు అలుముకోకూడదు. జాగ్రత్త మిత్రమా.

కబడ్డీ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ

చింతలపాలెం, నవంబర్ 7 (ప్రజాజ్యోతి) :



చింతలపాలెం మండల కేంద్రంలో జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ సోమవారం నిర్వహించనున్న హుజూర్‌నగర్ నియోజకవర్గ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ బ్రోచర్‌ను శనివారం గ్రామ సర్పంచ్ కందుల రామకోటి రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి, టోర్నమెంట్ కన్వీనర్లు, జాతీయ కబడ్డీ క్రీడాకారులు పొదిల కార్తీక్, బత్తుల రవితేజ, మలావత్ రాముడు, కబడ్డీ క్రీడాకారుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఆనందరావుకు బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు

- ఈ నెల 15న న్యూఢిల్లీలో అవార్డు ప్రధానం

వైద్యంతో పాటు సేవా రంగంలో 10 ఏళ్ల విశేష కృషికి గుర్తింపు

సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 07(ప్రజా జ్యోతి):

వైద్యం కేవలం వృత్తి మాత్రమే కాదు,సేవా భావంతో చేస్తేనే సమాజానికి నిజమైన సేవ చేసినట్లు అవుతుందని ప్రముఖ ఈఎన్?టీవైద్యులు డాక్టర్ ఆనందరావు నిరూపించారు.సాధారణ డాక్టర్ జీవితానికి అతీతంగా ఒక విద్యావంతుడిగా సమాజం పట్ల బాధ్యతగా,సామాజిక చైతన్యంతో,సమాజ సేవ చేయడం చాలా ముఖ్యమని ఆయన నమ్ముతారు.ఆ నమ్మకాన్ని గత 10 ఏళ్లుగా తన సేవల ద్వారా నిరూపిస్తున్నారు.డాక్టర్ ఆనందరావు గత పది సంవత్సరాలుగా సమాజానికి చేస్తున్న నిరంతర సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సంస్థ ఆయనను బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపిక చేసింది.ఈ సందర్భంగా డాక్టర్ ఆనందరావు మాట్లాడుతూ ఇది సూర్యాపేట జిల్లాకే గర్వకారణమని అన్నారు.తన సేవలను గుర్తించినందుకు దేవుడికి ధన్యవాదాలు తెలిపారు.ఈ ప్రతిష్టాత్మక జాతీయ అవార్డును ఈ నెల 15న న్యూఢిల్లీలో జరిగే ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానం



చేయనున్నారని తెలిపారు.వైద్య రంగంలోనే కాకుండా,విద్యా, సామాజిక,సేవా రంగాల్లో డాక్టర్ ఆనందరావు చేస్తున్న కృషిని అభినందిస్తూ సూర్యాపేట నుండి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు ప్రశంసించారు.

ప్రతి ఇంటా దీపావళి వెలుగులు నిండాలి

- ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ, నవంబర్ 07, (ప్రజా జ్యోతి) :

దీపావళి పండుగ ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆకాంక్షించారు.దేవరకొండ నియోజకవర్గం లోని సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు ప్రజలతో కలిసి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో వెలిగే దీపాలు ప్రతి కుటుంబంలో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని ఆకాంక్షించారు.నియోజకవర్గ ప్రజలందరికీ దీపావళి పండుగ శు భాకాంక్షలు తెలిపారు.



అనుమతులు నిల్లు.. ఆమ్దాని ఫుల్లు..

- మెయిన్ రోడ్డుపైనే ప్రమాదకర వ్యాపారం..

అధిక ధరలకు బాణాసంచా విక్రయాలు.. - కరువైన అధికారుల పర్యవేక్షణ

నూతనకల్, నవంబర్ 07 (ప్రజాజ్యోతి):

సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో బాణాసంచా దుకాణాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం అంటున్నారు ప్రయాణికులు.. ప్రభుత్వ నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటించకుండా మెయిన్ రోడ్డుపైనే బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. జనసంచారం అధికంగా ఉండే ప్రధాన రహదారిపై టపాసుల విక్రయాలు కొనసాగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. బాణాసంచా అనేది అత్యంత ప్రమాదకరమైన పేలుడు పదార్థాలకు సంబంధించిన వ్యాపారం. ఇలాంటి దుకాణాలను ఏర్పాటు చేయాలంటే సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు, లైసెన్సులు పొందడంతో పాటు అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటోంది. అయితే నూతనకల్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా..? లేవా..? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని, అధిక రేట్లకు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు..





మఠంపల్లి ఎంఎస్ఎఫ్ గ్రామ కమిటీ ఏర్పాటు

అధ్యక్షుడిగా తడిసిన విజయ్ మాదిగ ఏకగ్రీవ ఎన్నిక

మఠంపల్లి నవంబర్ 7 (ప్రజా జ్యోతి)

మఠంపల్లి మండల కేంద్రంలో మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కాంపాటి సందీప్ మాదిగ, గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రవీణ్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ (మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్) గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ అధ్యక్షుడిగా తడిసిన విజయ్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కాటేపల్లి సతీష్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా మంగళపల్లి ఏసుబాబు మాదిగ, అధికార ప్రతినిధిగా కేతేపల్లి నాగరాజు మాదిగ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంఘటితంగా ఉంటూ సామాజిక చైతన్యం, హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.నూతన కమిటీ సభ్యులకు విద్యార్థులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆరుపదుల వయసులో 3000 కిలోమీటర్లు సైకిల్ ర్యాలీ

- డ్రగ్స్ రహిత భారత దేశమే లక్ష్యంగా

ఆలేరు నవంబర్ 7 (ప్రజా జ్యోతి)





డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యంగా యువత, విద్యార్థి విద్యార్థులను చైతన్య పరుస్తూ 62 ఏళ్ల వయసులో హాయిగా పిల్లలతో గడపాల్సిన సమయంలో ఆంధ్రప్రదేశ్ భీమవరం నుండి ఢిల్లీ వరకు 3000 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని చేస్తున్న ఇందూరి విజయలక్ష్మి సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ అభినందించాల్సిందే. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు శనివారం సైకిల్ ర్యాలీగా వచ్చిన విజయలక్ష్మికి ఆలేరులో యాదగిరిగుట్ట సిఐ శంకర్, ఎస్ హెచ్ ఓ ఉదయ్ కిరణ్, పోలీసులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆమె ఆలేరులోని ఎస్సార్,విఆర్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు డ్రగ్స్ రహిత సమాజం కోసం అవగాహన కల్పించార. భీమవరంలో అక్టోబర్ 22న ప్రారంభించిన సైకిల్ ర్యాలీ డిసెంబర్ 10 వరకు ఆమె ఢిల్లీ చేరుకోనున్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి యువత మాత్రమే మంచి భారతదేశాన్ని నిర్మించగలరని 3000 కిలోమీటర్లు సైకిల్ రాని కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారుఎన్ని కిలోమీటర్లు చేశామన్నది ముఖ్యం కాదని ఎంతమంది? విద్యార్థులను చైతన్యం చేసామన్నది ముఖ్యమని ఆమె తెలిపారు. డిజీపి సందీప్ సాండిలియా, ఈగల్ టీం సాకారంతో సైకిల్ ర్యాలీ కొనసాగిస్తున్నానని నషా ముక్త భారత్ “అమ్మ చెప్పితే వినకపోతే అమ్మమ్మ చెప్పిన వినరా” అనే స్లోగంతో ఈ సైకిల్ ర్యాలీ కొనసాగిస్తున్నట్లు విజయలక్ష్మి తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం డ్రగ్స్ ను అరికట్టేందుకు 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారికి పారితోషకం తో పాటు వారి వివరాలు గోప్యంగా ఉంచుతారనిభయపడాల్సిన అవసరం లేదని విజయలక్ష్మి వివరించారు.కార్యక్రమంలో ఎస్సార్, విఆర్ కళాశాలల యాజమాన్యం, టీచర్లు, విద్యార్థిని విద్యార్థులతో డ్రగ్స్ రహిత సమాజం కోసం ఆమె ప్రతిజ్ఞ చేయించారు.

నేరేడుగొమ్ములో రూ.15 కోట్లతో ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనం నిర్మాణం అభినందనీయం

- ఎమ్మెల్యే బాలు నాయక్‌కు కాంగ్రెస్ నాయకుల ఘన సన్మానం

దేవరకొండ, నవంబర్ 07,

(ప్రజా జ్యోతి) :



నూతనంగా ఏర్పడిన నేరేడుగొమ్ము మండలంలో ప్రజలకు, రైతులకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకే చోట అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రూ.15 కోట్ల వ్యయంతో ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనాన్ని నిర్మిస్తుండటం అభినంద నీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు.గతంలో మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లో కొనసాగడంతో ప్రజలు వివిధ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఈ సమస్యను గుర్తించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రత్యేక చొరవ, కృషితో రూ.15 కోట్ల నిధులతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా సముదాయ భవన నిర్మాణం చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో నేరేడుగొమ్ము మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే బాలు నాయక్‌ను ఘనంగా సన్మానించారు. నేరేడుగొమ్ము మండల ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సముదాయ భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు సమయం ఆదా కావడంతో పాటు, రైతులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని, మండల అభివృద్ధికి ఎంతగానో దోహద పడుతుందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి లోకసాని కృష్ణయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాంకునావత్ బిక్కు నాయక్, గిరి యాదయ్య, గడ్డం వెంకటయ్య యాదవ్, కేతావత్ సోమాని, కొప్పుల సురేందర్ రెడ్డి, పులికంటి సుధాకర్, కేతావత్ రమేష్, నేనావత్ బాలు, రామావత్ బాబురామ్ నాయక్, గన్ను నాయక్, నీలం ఆంజనేయులు యాదవ్, నేనావత్ రాంజా నాయక్, ఎలిజర్ల శ్రీను, ముక్కమల్ల శేఖర్ గౌడ్, పంబాల పర్వతాలు, జర్పుల మకట్ లాల్, కుంభం రామకృష్ణ, నాగటి హరీష్, శ్రీపతి సైదులు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డుకు పోలీసుల ఆర్థిక చేయూత

రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసిన జిల్లా పోలీసులు

చివ్వెంల నవంబర్ 07(ప్రజాజ్యోతి):



కష్టకాలంలో తోటి సిబ్బందికి అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు సూర్యాపేట జిల్లా పోలీసులు.విధి నిర్వహణలో భాగస్వాములైన సిబ్బందిని ఒక కుటుంబంగా భావిస్తూ,అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు బాలకృష్ణ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు.చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. దీంతో ఆయనకు మెరుగైన వైద్యం అందించేందుకు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గ్లెనీగిల్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కె.నరసింహ స్పందించి,బాలకృష్ణ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని సూచించారు.ఎస్పీ ఆదేశాల మేరకు చివ్వెంల ఎస్సై మహేశ్వర్ రూ.లక్ష నగదును బాలకృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఆపద సమయంలో తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా నిలిచిన జిల్లా పోలీసుల సేవాభావంపై పలువురు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.పోలీస్ శాఖలోని ఐక్యత,మానవత్వానికి ఈ సహాయం నిదర్శనంగా నిలిచింది.

వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.3 లక్షల ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన - ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి

సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 07(ప్రజా జ్యోతి):

ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు.సూర్యాపేట పట్టణానికి చెందిన కొలిపాక రమేష్ మే నెలలో గుండెపోటుకు గురై స్థానిక ఆర్వీ ఆసుపత్రిలో చికిత్స పొందారు.ఈ వైద్యానికి సుమారు రూ.3 లక్షలు ఖర్చు కాగా,ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ విషయాన్ని పీఆర్టీయూ టీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్ రెడ్డి జిల్లా శాఖ తరఫున ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చులకు సంబంధించిన ఆర్థిక సహాయం మంజూరయ్యేలా కృషి చేశారు.ఈ మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో బాధితుడు కొలిపాక రమేష్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ఆర్థిక సహాయం మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కొలిపాక రమేష్‌తో పాటు పీఆర్టీయూ



టీఎస్ సూర్యాపేట జిల్లా శాఖ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్ రెడ్డి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కొట్టే శంకర్, హైదరాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తుమ్మల సురేందర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంజి శంకర్, చివ్వెంల మండల శాఖ అధ్యక్షుడు షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్ల వార్డుల్లోనూ అభివృద్ధి పనులు..

వివక్షకు తావులేదు!

పార్టీలకు అతీతంగా సూర్యాపేట పట్టణ అభివృద్ధి

మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత





సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 07(ప్రజా జ్యోతి):

పార్టీలకు అతీతంగా సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత,వైస్ చైర్మన్ షఫీ ఉల్లా అన్నారు.ఎన్నికల సమయంలోనే రాజకీయాలని,ఎన్నికల అనంతరం ప్రజా సమస్యల పరిష్కారం,పట్టణ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.శనివారం సూర్యాపేట పట్టణంలోని 7వ వార్డు బిలాల్ మసీదు ప్రాంతం,సీతారాంపురంలో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతోందని,సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిల సూచనలతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఇందులో ఎలాంటి రాజకీయ పక్షపాతం,వివక్షకు తావులేదని, బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు.7వ వార్డులో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం 7వ వార్డు కౌన్సిలర్ ఈదా ప్రవీణ్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు.వార్డులో ఏ సమస్యను తన దృష్టికి తీసుకెళ్లినా వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నారని,తమ వార్డు అభివృద్ధికి సహకరిస్తున్న చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణు,జిల్లా కాంగ్రెస్ నాయకులు దైద రవి,చంటి బాబు,విష్ణు స్వరూప్,పిట్టల నర్సి, సైదులు,మున్సిపల్ ఏఈ తిరుమలయ్య, వార్డు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ఆనందాల దీపాలు వెలగాలి!

- హాలియా పట్టణ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

హాలియా,నవంబర్7(ప్రజా జ్యోతి):

చెడుపై మంచి,చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని,పేద, మధ్యతరగతి కుటుంబాల జీవితాల్లో కొత్త ఆశలు,ఆర్థిక ప్రగతి వెల్లివిరియాలని కోరుకున్నారు.ప్రేమ, సోదరభావం,ఐక్యతతో ప్రజలందరూ కలిసిమెలిసి పండుగ జరుపుకోవాలని, హాలియా మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



మహిళా రైతుల కష్టాలు చూసి చలించిపోయిన కల్వకుంట్ల కవిత

- కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

దేవరకొండ, నవంబర్ 07,(ప్రజా జ్యోతి) :

చందంపేట మండలం పోలేపల్లి రైతు వేదిక వద్ద వేరుశనగ విత్తనాల కోసం ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్న మహిళా రైతుల కష్టాలను చూసి తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చలించిపోయారు.డిండి ప్రాజెక్టు పరిశీలనకు వెళ్తున్న క్రమంలో రైతు వేదిక వద్ద పెద్ద సంఖ్యలో మహిళా రైతులు ఉండటాన్ని గమనించిన ఆమె వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం డిండి నుంచి తిరిగి వస్తున్న సమయంలోనూ రైతులు అక్కడే వేచి ఉండటంతో రైతు వేదికను సందర్శించి వారి ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్నారు. విత్తనాల పంపిణీలో అధికారులు జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మహిళా రైతులు ఆమెకు వివరించారు.దీంతో వెంటనే నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌తో ఫోన్‌లో మాట్లాడిన కవిత.. గత ఏడాది 1,100 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయగా, ఈ ఏడాది కేవలం 600 క్వింటాళ్లు మాత్రమే కేటాయించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.దీనిపై స్పందించిన కలెక్టర్.. ఉదయం నుంచి ఎదురుచూస్తున్న మహిళా రైతులకు తక్షణమే విత్తనాలు పంపిణీ చేయాలని, మిగిలిన రైతుల పేర్లు నమోదు చేసి అదనంగా ఎంతమేర విత్తనాలు అవసరమో ఇండెంట్ పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కలెక్టర్ ఆదేశాలతో అధికారులు వెంటనే స్పందించి విత్తనాల కోసం ఎదురుచూస్తున్న మహిళా రైతులకు వేరుశనగ విత్తనాల సంచులను పంపిణీ చేశారు. దీంతో మహిళా రైతులు ఊరట చెందారు.

గోదావరి--కృష్ణా నదుల అనుసంధానమే

నల్గొండ నీటి సమస్యలకు పరిష్కారం



దేవరకొండ, నవంబర్ 07, (ప్రజా జ్యోతి) :

గోదావరి--కృష్ణా నదుల అనుసంధానమే ఉమ్మడి నల్గొండ జిల్లా నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఏదులకే రెండు టీఎంసీల నీటిని తీసుకురాలేని పరిస్థితుల్లో అక్కడి నుంచి డిండికి నీళ్లు ఎలా తెస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. శనివారం డిండి రిజర్వాయర్ వద్ద నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆమె మాట్లాడుతూ.. కాళేశ్వరం అదనపు టీఎంసీ నీటిని బస్వాపూర్ రిజర్వాయర్ మీదుగా డిండి ఎత్తిపోతల పథకానికి తరలించడమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. బస్వాపూర్ పనులు పూర్తి చేసి గోదావరి జలాలను వినియోగించుకోవాలని సూచించారు. ఏదుల నుంచి డిండికి నీళ్లు తెస్తామంటూ రెండు జిల్లాల ప్రజల మధ్య ప్రభుత్వం వివాదాలు సృష్టిస్తోందని విమర్శించారు.రాష్ట్రంలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ముందుగా పూర్తి చేయాలని, నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చిన్న రిజర్వాయర్లు నిర్మించాలని అన్నారు. పంటలు వేయని రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేసుగుర్రంలా పాలన సాగిస్తారని భావిస్తే కీలుగుర్రంగా మారిపోయారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ నాన్ పెర్ఫార్మింగ్ అసెట్‌గా మిగిలిపోయిందని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పరిష్కారాలు చూపిస్తున్న తెలంగాణ రక్షణ సేనకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు మద్దతు ఇవ్వాలని కవిత కోరారు.



